# సైన్స్ విభాగాలకు చోటేది?

## టీచర్స్ అవార్డ్సుపై ఔటా అసంతృప్తి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బెస్ట్ టీచర్ అవార్డుల్లో ఓయూ సైన్స్ విభాగాలకు చోటు దక్కకపోవడంపై ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ మేరకు ఔటా అధ్యక్షుడు ప్రొఫెసర్ మనోహర్ వర్సిటీ ఇన్‌చార్జి వీసీకి లేఖ పంపించారు. బెస్ట్ టీచర్ అవార్డు పొందిన అధ్యాపకులను అభినందించారు. వారు అందించిన సేవలకు సరైన గుర్తింపు లభించిందని చెప్పారు. సైన్స్ కళాశాలలోని 18 విభాగాల్లో ఒక్కరిని కూడా అవార్డులకు ఎంపిక చేయకపోవడం శోచనీయమన్నారు. సాధారణంగా ఏటా సైన్స్, ఆర్ట్స్ అండ్ సోషల్ సైన్సెస్, కామర్స్, ఇంజినీరింగ్ విభాగాల నుంచి ఒక్కొక్కరిని ఎంపిక చేస్తారని గుర్తు చేశారు. ఈ ఏడాది సైన్స్ విభాగాల నుంచి ఒక్కరిని కూడా ఎంపిక చేయకపోవడం ఆ విభాగాల అధ్యాపకులను తీవ్రంగా నిరుత్సాహపరిచిందన్నారు. సైన్స్ విభాగాలకు చెందిన అధ్యాపకుల ప్రొఫైల్స్‌ను జాగ్రత్తగా పరిశీలించాలని ఓయూ అధికారులకు సూచించారు.


నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, శుక్రవారం 6 సెప్టెంబర్ 2024 | HYDERABAD




మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

# గ్రేటర్‌కు ఎల్లో అలర్ట్

సిటీబ్యూరో, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): రుతుపవనాల ప్రభావంతో గ్రేటర్‌లోని పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వాన కురిసింది. గురువారం రాత్రి 8 గంటల వరకు రాజేంద్రనగర్, దాని పరిసర ప్రాంతాల్లో అత్యధికంగా 3.50 సెం.మీలు, సికింద్రాబాద్ పాటిగడ్డలో 1.70, బన్సీలాల్‌పేట్, భోలక్‌పూర్, ముషీరాబాద్, అంబర్‌పేటలో 1.65, ఖైరతాబాద్, నాంపల్లి ప్రాంతాల్లో 1.50, మూసాపేట్, ఉప్పల్ మూసారాంబాగ్, బతుకమ్మకుంట ప్రాంతాల్లో 1.4 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. రుతుపవనాలు చురుకుగా కదులుతుండటంతో పాటు బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తన ప్రభావంతో రాగల రెండ్రోజులు గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు, మరికొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వానలు కురిసే అవకాశాలున్నాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలోనే గ్రేటర్‌కు ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీ చేశారు.

# భారీ నిర్మాణాల వద్ద చైల్డ్ కేర్ సెంటర్లు

సిటీబ్యూరో, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్‌లో చిన్నారులపై వీధి కుక్కల దాడుల పెరుగుతున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ కీలక నిర్ణయం తీసుకున్నది. భారీ నిర్మాణ ప్రదేశాల్లో కూలీల పిల్లల కోసం చైల్డ్ కేర్ సెంటర్ల ఏర్పాటును తప్పనిసరి చేస్తూ కమిషనర్ ఆమ్రపాలి ఉత్తర్వులు జారీ చేశారు.



విత్తన గణపతిని పంపిణీ చేస్తున్న గ్రీన్ ఇండియా చాలెంజ్ కో ఆర్డినేటర్ గర్రెపల్లి సతీష్



వారసిగూడ రహదారిలో పేరుకుపోయిన వ్యర్థాలు

# స్వచ్ఛ సిటీ ప్రశ్నార్థకం

## గ్రేటర్ రోడ్లపై మళ్లీ చెత్త డబ్బాలు

**తొలి విడతలో మార్కెట్లు, బహిరంగ ప్రదేశాలు కలిపి 28 చోట్ల**

**డస్ట్ బిన్ ఫ్రీ సిటీ లక్ష్యానికి నీళ్లొదిలిన బల్దియా**

సిటీబ్యూరో, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ హైదరాబాద్‌లో చెత్త సమస్య జటిలంగా మారింది. గార్బేజ్ ఫ్రీ సిటీయే లక్ష్యమని జీహెచ్‌ఎంసీ చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో మాత్రం ఇందుకు విరుద్ధంగా పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎక్కడ చూసినా పేరుకుపోయిన చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. ప్రధాన రహదారుల నుంచి గల్లీ రోడ్ల దాకా వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. అసలే వర్షాలు పడుతున్న వేళ.. కాలనీ, బస్తీలు కంపుకొడుతున్నాయి. డెంగీ, మలేరియా ఇతర రోగాలతో ప్రజలు సతమతమవుతున్నా.. మేయర్, కమిషనర్ మొదలు జోనల్ కమిషనర్ల వరకు పారిశుధ్య నిర్వహణపై క్షేత్రస్థాయి తనిఖీలు జరపడం లేదు. పారిశుధ్య నిర్వహణలో లోపాలను సరిదిద్ది... 'స్వచ్ఛ హైదరాబాద్'కు మెరుగైన ర్యాంకింగ్ లక్ష్యంగా కృషి చేయాల్సిన అధికారులు.. ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. డస్ట్ బిన్ లెస్ సిటీగా మార్చే లక్ష్యంలో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో, రోడ్ల వెంబడి చెత్త డబ్బాలను తీసేసిన అధికారులు.. తాజాగా డంపర్‌బిన్స్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తొలి విడతగా మార్కెట్లు బహిరంగ ప్రదేశాలు కలిపి 28 చోట్ల డంపర్‌బిన్స్ (పెద్ద చెత్త డబ్బాలు) ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు బల్దియా డంపర్ బిన్స్ ఏర్పాటు చేయాలని రాంకీ ఏజెన్సీని ఆదేశించినట్లు తెలుస్తున్నది. ఇదే జరిగితే 'స్వచ్ఛ హైదరాబాద్' లక్ష్యం ప్రశ్నార్థకంగా మారుతుంది.

### బహిరంగ ప్రదేశాల్లో చెత్త లేకుండా..

స్వచ్ఛ హైదరాబాద్‌లో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో చెత్త లేకుండా చేసేందుకు డస్ట్ బిన్ ఫ్రీ సిటీగా మార్చాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. బహిరంగ ప్రదేశాల్లో, రోడ్ల వెంబడి చెత్త డబ్బాలను దాదాపు 800 చోట్లకుపైగా తగ్గించే కార్యక్రమాలను అమలు చేసింది. పెరిగిన జనాభా, కాలనీల్లో చెత్త ఉత్పత్తి పెరిగినప్పటికీ అందుకు అనుగుణంగా తరలించే స్వచ్ఛ ఆటోలు, వాహనాలను పెంచుతూ వచ్చారు. వీధి వ్యాపారులు (స్ట్రీట్ వెండర్స్) తప్పనిసరిగా డస్ట్‌బిన్‌లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ నేపథ్యంలోనే ఇంటి నుంచి చెత్తను ఆటోల్లో ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌కు, అటు నుంచి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అయితే రోడ్లపై చెత్త ఉండొద్దనుకున్నప్పటికీ అధికారులు సరైన చర్యలు తీసుకోకపోవడంతో రహదారులపై వ్యర్థాల సమస్య తీవ్రరూపం దాల్చుతున్నది.

### నీరుగారుతున్న స్వచ్ఛ లక్ష్యం

గ్రేటర్‌లో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పుతున్నది. 'స్వచ్ఛ సర్వేక్షణ్-2024'లో హైదరాబాద్ నగరాన్ని స్వచ్ఛతలో అగ్రస్థానంలో నిలుపుతామన్న లక్ష్యం నీరుగారుతున్నది. గడిచిన కొన్ని రోజులుగా ఎక్కడ చూసినా.. రహదారుల వెంట పేరుకుపోయిన చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. తరచూ చెత్త వేసే ప్రాంతాలు (గార్బేజీ వనరేబుల్ పాయింట్లు/జీవీపీ) జీహెచ్‌ఎంసీ పరిధిలో 2640 ప్రాంతాలను గుర్తించి.. వాటిని పూర్తి స్థాయిలో ఎత్తివేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో వీటికి అదనంగా కొత్తగా జీవీపీ పాయింట్లు పుట్టుకొస్తున్నాయి. స్వచ్ఛ ఆటోల ద్వారా ఇంటింటి చెత్త సేకరణ సరిగా జరగడం లేదు. స్వచ్ఛ ఆటోల పనితీరు సరిగా ఉండటం లేదు. చాలా కాలనీలకు రోజూ స్వచ్ఛ ఆటోలు రావడం లేదు. వందకు వంద శాతం స్వచ్ఛ ఆటోల అటెండెన్స్ ఉండటం లేదు. ఈ నేపథ్యంలోనే పారిశుధ్యంపై ఫిర్యాదులు అధికం కావడం, ఇటీవల హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్వయంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పారిశుధ్య నిర్వహణ ఏ మాత్రం బాగలేదని, తన డివిజన్‌లో చెత్త ఎత్తడం లేదని సంబంధిత అధికారులపై మండిపడటం గమనార్హం. వాస్తవంగా వర్షాకాలంలో వ్యర్థాలు త్వరగా కుళ్లి దుర్గంధం వెదజల్లే పరిస్థితులు ఎక్కువ. అయితే చెత్తను ఎప్పటికప్పుడు తరలించేందుకు వర్షాకాలంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయడం లేదు. వర్షాలొస్తే దోమలు, ఈగలు, క్రిమికీటకాలు వృద్ధి చెంది రోగాల బారిన పడి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కమిషనర్ ఆమ్రపాలి పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం పై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించినా.. క్షేత్ర స్థాయిలో నిర్ణయాలు అమలు కావడం లేదు.

# రేవంత్‌ది ఆర్డినెన్స్ పాలన

## కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఆగ్రహం

**51 గ్రామాలను శివారు మున్సిపాలిటీల్లో అత్యవసరంగా కలుపాల్సిన అవసరమేమొచ్చింది?**

**ఇంత పెద్ద నిర్ణయం హడావుడిగా తీసుకుంటారా?**

**ఎవరితో చర్చించారు? అఖిలపక్షానికి చెప్పరా?**

**ముఖ్యమంత్రి దురాశ దుఃఖానికి చేటు అవుతది**

హైదరాబాద్, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ప్రజాపాలన సాగుతున్నదని చెప్పుకొనే రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఆర్డినెన్స్‌ల పాలన తీసుకొచ్చారని బీఆర్‌ఎస్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ విమర్శించారు. హైదరాబాద్ ఔటర్ రింగురోడ్డు లోపల, బయట ఉన్న 51 గ్రామ పంచాయతీలను శివారు మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అత్యవసరంగా ఆర్డినెన్స్ తీసుకురావాల్సిన అవసరం ఏమొచ్చిందని ప్రశ్నించారు. అఖిలపక్ష సమావేశం పెట్టకుండా, గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలతో చర్చించకుండా, గ్రామాలను విలీనం చేయడమేంటని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి అనాలోచిత, అసమర్థ నిర్ణయాలతో హైదరాబాద్ ప్రతిష్ఠ దెబ్బతింటున్నదని మండిపడ్డారు. తెలంగాణభవన్‌లో గురువారం బీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, తుంగ బాలుతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. మున్సిపల్‌శాఖ తన దగ్గరే ఉన్నదని, ఎవరితో మాట్లాడకుండా సీఎం ఏకపక్షంగా నిర్ణయం తీసుకుంటారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాల్లో చర్చించకుండా నిర్ణయం ఎలా తీసుకుంటారని నిలదీశారు. సీఎంకు అవగాహన లేకపోతే వేరొకరికి మున్సిపల్‌శాఖ అప్పగించాలని, కేంద్రీకృత వ్యవస్థను సీఎం ప్రవేశపెడుతున్నారని, రేవంత్ దురాశ దుఃఖానికి చేటు అవుతుందని హెచ్చరించారు.

### భారం తప్ప..లాభం లేదు..

ఓఆర్‌ఆర్ లోపల మున్సిపాలిటీలను కలిపి హైదరాబాద్ మహా కార్పొరేషన్ చేయాలని జూలైలో సర్క్యులర్ జారీచేశారని, దానికి విరుద్ధంగా ఇప్పుడు నిర్ణయం వచ్చిందని వివేకానంద్ తెలిపారు. మౌలిక సదుపాయాలు లేకున్నా శివారు గ్రామాలు హైదరాబాద్‌తో సమానంగా పన్నులు కట్టాలా? అని ప్రశ్నించారు. గ్రామపంచాయతీలను మున్సిపాలిటీల్లో కలపడం వల్ల ప్రజలపై భారమే తప్ప లాభం లేదని చెప్పారు.

### విలీనంపై లోతైన చర్చ జరగాలి

మున్సిపాలిటీల్లో గ్రామాల విలీనాన్ని వెంటనే ఆపాలని కేపీ వివేకానంద్ డిమాండ్ చేశారు. ఈ అంశంపై వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి లోతైన చర్చ జరపాలని సూచించారు. 2,053 చదరపు కిలోమీటర్ల పరిధి గల కార్పొరేషన్‌తో కేంద్రీకృత వ్యవస్థ ఏర్పడితే ప్రజలకు నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. సీఎం అనాలోచిత చర్యలతో రియల్ ఎస్టేట్ రంగం కుదేలవుతున్నదని, రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ ఆదాయం నెలకు రూ.300 కోట్ల మేర తగ్గిందని చెప్పారు. హైడ్రా పేరుతో వసూళ్ల కార్యక్రమం జరుగుతున్నదని ఆరోపించారు.

### ప్రజల హక్కులు కాలరాయడమే

ఒక్క మీటింగ్‌లోనే గ్రామాల విలీన నిర్ణయాన్ని క్యాబినెట్ సబ్ కమిటీ ఎలా తీసుకుంటుందని, ఇది ప్రజల హక్కులను కాలరాయడమేనని బీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ మండిపడ్డారు. సంబంధితశాఖ మంత్రి లేకుండా క్యాబినెట్ సబ్ కమిటీ ఉంటుందా? అని ప్రశ్నించారు. సీఎం బిజీగా ఉంటే మున్సిపల్‌శాఖను శ్రీధర్‌బాబుకో, సీతక్కకో అప్పగించాలని సూచించారు.వెంటనే ఆర్డినెన్సును రద్దు చేయాలని లేకపోతే బీఆర్‌ఎస్ ప్రజల పక్షాన పోరాడుతుందని స్పష్టం చేశారు.

# ఆ గ్రామ పంచాయతీల సంగతేంటి?



మేడ్చల్, సెప్టెంబర్ 5(నమస్తే తెలంగాణ): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 61 వాటిల్లో 28 గ్రామపంచాయతీలను ప్రభుత్వం వివిధ మున్సిపాలిటీల పరిధిలోకి విలీనం చేసింది. అయితే మిగిలిన 33 గ్రామ పంచాయతీల పరిస్థితి ఏమిటన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. వీటిపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుదోనన్న అంశంపై ఉత్కంఠ నెలకొంది. విలీనం కాని గ్రామాలు మున్సిపాలిటీ పరిధిలోకి మారుతాయా..లేక గ్రామ పంచాయతీలుగానే కొనసాగుతాయా అన్నది వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# శ్రీ సప్తముఖుడికి నేత్రాలంకరణ



ఖైరతాబాద్, సెప్టెంబర్ 5 : ఏడుపడగల ఆదిశేషుడి నీడలో ఏడుపదుల అడుగుల్లో కొలువుదీరిన శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతి నేత్రాలంకరణ గురువారం ఉదయం వేడుకగా సాగింది. శిల్పి చిన్నస్వామి రాజేంద్ర స్వామి వారికి నేత్రాలను అలంకరించారు. ఈ ఘట్టం పూర్తి కావడంతో సాయంత్రం విగ్రహం చుట్టూ ఉన్న కర్రలను తొలగించి భక్తులకు దర్శనానికి వీలు కల్పించారు.

### 75 అడుగుల కండువా..

శ్రీ సప్తముఖ మహాశక్తి గణపతికి ఖైరతాబాద్ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో 75 అడుగుల కండువా, జంధ్యం, గరికమాలను సమర్పించనున్నారు. శనివారం వినాయక చవితి రోజు విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవ క్రతువుల్లో వాటిని స్వామివారికి అలంకరించనున్నారు. నైపుణ్యవంతులైన నేత కార్మికులతో చేనేత కండువా, జంధ్యం, పట్టువస్త్రాలను తయారు చేయించామని సంఘం అధ్యక్షుడు కడారి శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు గురువారం సంఘం గౌరవ అధ్యక్షుడు గుర్రం కొండయ్య, ప్రధాన కార్యదర్శి ఏలె స్వామితో కలిసి వాటిని మీడియాకు ప్రదర్శించారు. వినాయకచవితి రోజు ఉదయం 7 గంటలకు రాజ్‌దూత్ చౌరస్తా నుంచి తెలంగాణ కళా రూపాలైన ఒగ్గుడోలు, గుస్సాడి నృత్యం, కోలాటాల మధ్య గుర్రపు బగ్గీలో వాటిని ఊరేగించి గణేశుడికి సమర్పిస్తామన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఐఏఎస్ అధికారులు పార్థసారధి, చిరంజీవులు, వెంకటేశ్ నామాని, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సురేంద్ర మోహన్, ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్, డీసీపీ రావిరాల వెంకటేశ్వర్లు, మాజీ అడ్వకేట్ జనరల్ శివానంద ప్రసాద్, శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ హార్టికల్చర్ యూనివర్సిటీ వీసీ నీరజ ప్రభాకర్, టీఎస్‌టీఎస్ ఎండీ శంకరయ్య, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, తెలంగాణ హౌసింగ్ బోర్డు కార్యదర్శి బేతి రాజేశం, పోస్టల్ సర్వీస్ డైరెక్టర్ కైరంకొండ సంతోష్ నేత, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేశ్, దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్, ఐఅండ్‌పీఆర్ మాజీ డైరెక్టర్ రాజమౌళి తదితరులు హాజరవుతున్నారన్నారు.



కండువా, జంధ్యం, గరికమాలలను ప్రదర్శిస్తున్న పద్మశాలి సంఘం ప్రతినిధులు



ఉప్పల్‌లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో వాగ్వాదం చేస్తున్న నేతలు

# మేయర్ పర్యటన రచ్చ.. రచ్చ

**నిమజ్జన ఏర్పాట్లు సరిగా లేవంటూ..నిలదీత**

**కాంగ్రెస్ నేతలు దాడి చేశారని ఉప్పల్ పీఎస్ ఎదుట భాగ్యనగర్ ఉత్సవ సమితి ప్రతినిధుల ధర్నా**

ఉప్పల్, సెప్టెంబర్ 5 : ఉప్పల్‌లో గురువారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పర్యటన ఉద్రిక్తతకు దారితీసింది. నల్లచెరువు ప్రాంతంలోని నిమజ్జన ఏర్పాట్లు, పనుల పరిశీలనకు వచ్చిన మేయర్‌ను పలువురు నేతలు, ఉత్సవ సమితి ప్రతినిధులు నిలదీశారు. నిమజ్జనం సందర్భంగా ఏర్పాట్లు సరిగా చేయడంలేదన్నారు. ఈ క్రమంలో కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకున్నది. గణేశ్ నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్లు సరిగా లేవంటూ.. బీఆర్‌ఎస్ నేతలు మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ క్రమంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ నేతల మధ్య వాగ్వాదం జరగ్గా.. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సర్దిచెప్పారు. దీంతో గొడవ సద్దుమణిగింది. ఈ క్రమంలో మేయర్ కల్పించుకొని ఎలాంటి వాగ్వాదం చేయవద్దని, ఘర్షణలు పడవద్దని పార్టీ నేతలకు సూచించారు.

### ఉప్పల్ ప్రధాన రహదారి సమస్యపై..

భాగ్యనగర్ ఉత్సవ సమితి ఉప్పల్ అసెంబ్లీ కన్వీనర్ రెవెల్లి రాజు ఉప్పల్ ప్రధాన రహదారి సమస్యను మేయర్ గద్వాల్ విజయలక్ష్మి దృష్టికి తీసుకువెళ్లారు. ఉప్పల్ ప్రధాన రహదారి సమస్య ఇబ్బందిగా ఉందని, నిమజ్జనం సందర్భంగా మరింత జటిలంగా మారుతుందని, సమస్యను సత్వరం పరిష్కరించేవిధంగా రోడ్డు పనులు చేపట్టాలని కోరారు. కాగా, కాంగ్రెస్ నేతలు తనపై దాడికి పాల్పడ్డారని ఆరోపిస్తూ రెవెల్లి రాజు ఉప్పల్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఉత్సవ సమితి ప్రతినిధులతో కలిసి నిరసన తెలిపారు. మేయర్ పర్యటన సందర్భంగా ఉప్పల్‌లో నిమజ్జన ఏర్పాట్లు, ప్రధాన రహదారి సమస్యలను మేయర్ దృష్టికి తీసుకువెళ్లామని, ఈ క్రమంలో కొంతమంది తనతో వాగ్వాదానికి దిగారని రాజు పేర్కొన్నారు. అనంతరం కార్పొరేటర్ పిలుస్తున్నారంటూ.. కొందరు చెప్పారని, ఉప్పల్ నిమజ్జన కొలను వద్ద వెళ్లి మాట్లాడుతుండగా, తనపై విక్షణారహితంగా దాడి చేశారన్నారు. పనులు చేయమని అడిగితే కాంగ్రెస్ నేతలు దాడికి పాల్పడ్డారన్నారు. బాధ్యులపై కేసు నమోదు చేయాలని ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడిన కాంగ్రెస్ నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే ఉప్పల్ నల్లచెరువును మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, డిప్యూటీ మేయర్ శ్రీలతాశోభన్‌రెడ్డి పరిశీలించారు. నిమజ్జనం సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేటర్ల విరాళం

సిటీబ్యూరో, సెప్టెంబర్ 5 (నమస్తే తెలంగాణ): వరద బాధితుల సహాయార్థం ఒక్క నెల వేతనాన్ని విరాళమిచ్చేందుకు కార్పొరేటర్లు ముందుకొచ్చారు. సంబంధిత మొత్తాన్ని కార్పొరేటర్లు సీఎం రేవంత్‌రెడ్డిని త్వరలో కలిసి అందజేయనున్నట్లు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు.